

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

గురువారం 22 ఆగస్టు 2024

గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0

***

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.20 (309.6546)	37,882	47,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.07)	3,755.52	2,321.07
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.67 (45.25)	19.073	31,600

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.186 | స్కిన్‌లెస్ : రూ.216

కబ్జా కోరల్లో వల్లభరావు చెరువు



వల్లభరావు చెరువు శిఖంలో ఆక్రమణ

» హద్దులను చెరిపి ఆక్రమిస్తున్న వైనం » చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు » పట్టించుకోని నీటి పారుదలశాఖ

» కబ్జాదారుల్లో పలువురు రాజకీయ నాయకులు » మినీట్యాంక్ బండ్ నిర్మాణం ఉత్తమాటేనా?

మినీట్యాంక్ బండ్‌గా నూతన శోభను సంతరించుకోవాల్సిన వల్లభరావు (బతుకమ్మ) చెరువు శిఖం ఆక్రమణదారుల పాలవుతోంది. గతంలో ఉన్న హద్దులను అక్రమార్కులు చెరిపి ప్రహరీల నిర్మాణాలు చేసి మరీ గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. ఆ తరువాత నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మళ్లీ ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. పక్కన ఉన్న భూమి సర్వే నెంబర్‌ను చూపుతూ చెరువు శిఖం భూమిని తప్పుడు పత్రాలతో దర్జాగా కబ్జాచేస్తున్నారు.

● నల్లగొండ

సుమారు 86ఎకరాలు కలిగిన వల్లభరావు చెరువు శిఖం మరోసారి ఆక్రమణలకు గురవుతోంది. ఈ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం రూ.2.50కోట్లు కేటాయించడంతో పాటు 2022, ఏప్రిల్ 5న అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపనలు కూడా చేశారు. రెండేళ్ల క్రితం చెరువు ఆక్రమణకు గురికావడంతో పోలీస్ బందోబస్తు నడుమ వాటిని అధికారులు తొలగించడమేగాక హద్దులను నిర్ణయించారు. అయితే ఆక్రమణదారులు కొంతకాలం మిన్నకుండి మళ్లీ కొద్ది రోజులుగా చెరువు శిఖాన్ని ఆక్రమించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎలాంటి కాగితాలు లేకున్నా, కొత్తగా సృష్టించి ప్రహరీ నిర్మిస్తున్నారు. చెరువు శిఖంలో నీటిపారుదలశాఖ అధికారులు గతంలో హద్దులు కూడా నిర్ణయించి దిమ్మెలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ దిమ్మెలు నామరూపాలు లేకుండా పోయాయి. దీంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చెరువు శిఖాన్ని కబ్జా చేస్తున్నారు.



వల్లభరావు చెరువు శిఖాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించి ఏర్పాటుచేసిన గేటు

హద్దులను చెరిపేసి

కొంత మంది ఆక్రమణదారులు చెరువు శిఖాన్ని కబ్జా చేస్తుండడంతో రెండేళ్ల క్రితం అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఓ వ్యక్తి ఏకంగా పునాది కట్టి ఆక్రమించుకునే ప్రయత్నం చేయడంతో నాడు ఇరిగేషన్ అధికారులు కొలతలు వేసి నిర్మాణాలు తొలగించారు. మళ్లీ కొంత మంది ఆక్రమణదారులు చెరువు శిఖంలో హద్దులను దాటి వచ్చి ప్రహరీ నిర్మించడమేగాక అందులో మట్టి నింపే ప్రయత్నాల్లో ఉన్నారు. నీటిపారుదలశాఖ అధికారులు చెరువులపై పట్టు కోల్పోవడమేగాక, కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న చెరువు ఆక్రమణదారుల పాలవుతుంటే ఐబీ అధికార ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంపై శాఖలోని కొంత మంది అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వల్లభరావు చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేయాల్సిన నల్లగొండ మునిసిపాలిటీ అధికారులు సైతం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పనులు నత్తనడకన సాగడంతో ఆ పనులకు ఆక్రమణదారులతో ఆటంకాలు ఎదురవుతున్నాయి. చెరువుకు ఏర్పాటు చేసిన రేలింగ్ కూడా విరిగిపోతోంది. ఆహ్లాదకరంగా చెరువును తీర్చిదిద్దాల్సిన మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తుండగా, మరోవైపు చెరువు శిఖం భూములు కాపాడాల్సిన నీటి పారుదలశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

కబ్జాదారుల్లో రాజకీయ నాయకులు?

వల్లభరావు చెరువు ఆక్రమణలో కొందరు సాధారణ వ్యక్తులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు శిఖం రోజురోజుకూ ఆక్రమణదారుల చేతుల్లో చిక్కి కుచించుకు పోతోంది. చెరువును అభివృద్ధి చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో 86 ఎకరాలకు పైగా ఉండాల్సిన చెరువు శిఖం నానాటికీ తీసికట్టుగా మారుతోంది.

కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలంటే హైదరాబాద్‌లో హైడ్రాలా స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ నల్లగొండలోనూ ఉండాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మినీ ట్యాంక్ బండ్‌గా రూపుదిద్దాల్సిన వల్లభరావు చెరువును ఓ వైపు ఆక్రమణ దారులు కబ్జా చేస్తుండగా, మరో వైపు చెరువుతో పాటు చెరువు కట్టపై కంపచెట్లు పెరిగి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నా విమర్శలు వెలువెత్తుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కొంతమంది ఇక్కడ మద్యం తాగుతూ దారిన వచ్చి పోయే వారిని ఇబ్బందులను గురిచేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది నీటిపారుదల శాఖ అధికారులు, రాజకీయ నాయకులతో సఖ్యతగా ఉండి శిఖం భూమి అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణలు మా దృష్టికి వచ్చాయి

వల్లభరావు చెరువు ఆక్రమణకు గురవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాం. నేను ఇటీవలే బదిలీపై జిల్లాకు వచ్చా. గతంలో పనిచేసిన అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఏమైనా ఆక్రమణలు ఉంటే విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

శ్రీశైలం, నీటిపారుదలశాఖ ఏఈఈ

రైతు రుణమాఫీపై రగడ

» కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల సవాళ్లకు వేదికగా గుట్ట

» దేవుళ్ల మీద ఒట్టేసి మాటతప్పిన సీఎం అంటూ బీఆర్ఎస్ ధర్నాకు పిలుపు

» నేడు యాదగిరీశుడికి పూజలు నిర్వహించనున్న హరీ‌ష్‌రావు.. ఆలేరులో ధర్నా

యాదాద్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పూర్తి చేశామంటున్న ముఖ్యమంత్రి.. లేదు కాలేదంటున్న బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీ‌ష్‌రావు. ఎవరి వాదనలు ఎటున్నా.. వీరి వ్యాఖ్యలకు యాదాద్రి జిల్లా రాజకీయ కేంద్ర బిందువుగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి మాటతప్పారని మాజీ మంత్రి హరీ‌ష్‌రావు నేడు ఆలేరులో ఆందోళన నిర్వహించనున్నారు.

రైతుల రుణమాఫీ అంశం అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సవాళ్లు, ప్రతివాళ్లకు గట్ట వేదికైంది. రుణమాఫీపై బీఆర్ఎస్ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధి వేదికగా రాజకీయ తెరలేపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ రూ.2లక్షల వరకు చేశామని ప్రభుత్వం ప్రకటించగా, దేవుళ్ల మీద ఒట్టేసి అరకొరగా రైతులకు రుణమాఫీ చేశారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దేవేళ్ల మీద ఒట్టేసి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసేందుకు గురువారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మాజీమంత్రి హరీ‌ష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించి, ఆలేరులో ధర్నాకు దిగుతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్లతో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ సీనియర్‌నేత హరీ‌ష్‌రావు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని నలుమూలలనుంచి పార్టీ శ్రేణులను ధర్నాలో పాల్గొనేలా సన్నాహాలు చేస్తున్నారు. రైతులందరి తరపున ఈ ప్రభుత్వాన్ని నిలదీద్దామని, పార్టీ చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిస్తున్నారు. ఉదయం 9గంటలకు స్వామివారి దర్శించుకున్న అనంతరం, ధర్నాకు బయలుదేరనున్నారు.

భువనగిరి వేదికగా సీఎం హామీ

రైతులకు రూ.2లక్షలవరకు రుణమాఫీ చేస్తానని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ విస్తృత ప్రచారం చేపట్టింది. అయితే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణమాఫీ చేస్తామని మాట తప్పిందని, ఓట్లు దండుకునేందుకు రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ విమర్శించింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 21న భువనగిరి అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన సభలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా చెబుతున్న... ఏదీ ఏమైనా సరే పంద్రాగస్టు నాడు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం' అని ప్రకటించారు. ఈ మేరకు మొదటి విడతలో రూ.లక్షలోపు, రెండోవిడతలో రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు, మూడో విడతలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మాట తప్పిన సర్కార్ : హరీ‌ష్‌రావు



ఆగస్టు 15లోగా రైతులందరీ రుణాలు మాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి మీద ఒట్టు పెట్టుకుని మాట తప్పారని మాజీ మంత్రి హరీ‌ష్‌రావు అన్నారు. రుణమాఫీ మొత్తం రూ.49వేల కోట్లు అని, కేబినెట్‌లో రూ.31వేల కోట్లు, బడ్జెట్ కేటాయింపుల్లో రూ.26వేల కోట్లకు కుదించారన్నారు. రుణమాఫీ చేశామని సీఎం చెబుతుంటే, మంత్రులు కాలేదంటున్నారు. ఎవరి మాట నిజమో తెలియక రైతులు ఆందోళకు గురవుతున్నారన్నారు. దేవేళ్ల మీద ఇట్టేసి మాట తప్పిన సీఎంను నిలదీసేందుకు స్వామివారికి పూజలు నిర్వహించి, ఆలేరులో ధర్నా నిర్వహిస్తామన్నారు.



నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, తదితరులు

త్రిపుర ప్రజలకు మంచి పాలన అందిస్తున్నా

● త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

తుంగతుర్తి, ఆగస్టు 21 : కేంద్ర ప్రభుత్వ రాష్ట్రాలకు సమన్వయ కర్తగా ఉంటూ త్రిపుర ప్రజలకు మంచిపాలన అందిస్తున్నామని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గవర్నర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలానికి విచ్చేయడంతో బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి ప్రాంత బిడ్డగా త్రిపుర ప్రజలకు గవర్నర్‌గా సేవ చేసే భాగ్యం ప్రధాని నరేంద్రమోదీ కల్పించారని, అందుకు మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఆ ప్రాంతం అంతా బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతమని ఆ రాష్ట్రంలో ఎనిమిది జిల్లాలు ఉన్నాయన్నారు. అందులో గిరిజనులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. అక్కడి జిల్లా అధికారులతో సమావేశమై ప్రజా సమస్యలను, వాటిని పరిష్కరించాల్సిన మార్గాలను తెలుసుకుని ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేస్తూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించేలా కృషి చేస్తున్నానన్నారు. త్రిపుర రాష్ట్ర ప్రజలకు సరిహద్దులో బంగ్లాదేశ్ ప్రజలు ఉంటారని, రెండు ప్రాంతాల మధ్య అంగళ్లు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తారన్నారు. దేశ సరిహద్దు వెంబడి నిరంతరం నిఘా అప్రమత్తం చేస్తూ రాష్ట్ర ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా కృషి చేస్తున్నామన్నారు.

అర్హులను గుర్తించేందుకే భూసర్వే

అదనపు కలెక్టర్ శ్రీనివాస్




రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 21: కాస్తులో ఉంటూ సేద్యం చేసుకుంటున్న అర్హులైన రైతులను గుర్తించేందుకే క్షేత్రస్థాయిలో భూసర్వే నిర్వహిస్తున్నట్టు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా బుధవారం మండలంలో ఆయన పర్యటించారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిమ్మాయిపాలెంలో సర్వే నెం.70లో నిర్వహిస్తున్న భూసర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో మొత్తం ఐదు బృందాలతో సర్వేను ముమ్మరం చేశామన్నారు. రెవెన్యూ బృందాలు పకడ్బందీగా సర్వే నిర్వహించి అర్హులను గుర్తించాలన్నారు. పట్టా భూములు ఉన్న రైతులకు సంబంధించి టీఎం-33లో దరఖాస్తు చేసుకున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సర్వే భూకొలతల శాఖ ఏడీ శ్రీనివాసులు, స్థానిక నాయకులు మెరావత్ మునినాయక్, బుజ్జి, రామారావు, రైతులు సోమా, సీతా, దత్తు, రాంబాబు, లక్ష్మా, సేవా, ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 21: మహిళా సంఘాలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం శాలిగౌరారంలో నిర్వహించిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నిర్దేశించిన విధంగా సంఘ సమావేశాలు నిర్వహించాలన్నారు. స్త్రీనిధి రుణాల రికవరీలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించి మహిళలను చైతన్యవంతులు చేయాలన్నారు. అదేవిధంగా ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. ఎకరం, అరెకరం స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. ఉపాధిహామీ పనులను వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జ్యోతి లక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీడీఎం దామోదర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమార్, ఏపీఎం జానకీ, స్త్రీనిధి ఏఎం విజయశాంతి, ఏపీవో జంగమ్మ, ఈసీ విశ్వనాథుల వెంకటాచారి, ఎర్ర బుచ్చయ్య, బట్ట సైదులు, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, రవికిరణ్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు : కలెక్టర్

పశువైద్య ఉపకేంద్రం లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సస్పెండ్



గుర్రంపోడు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో వృద్ధుడికి ఇచ్చిన మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

గుర్రంపోడు, ఆగస్టు 21: విధుల్లో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమ తీరును మండలంలోని కొప్పోలు గ్రామంలో బుధవారం పరిశీలించారు. విధులకు సరిగా హాజరుకాకపోవడంతోపాటు పశు చికిత్స సరిగా అందించడం లేదని గ్రామస్థుల ఫిర్యాదు చేయగా, పశువైద్య ఉప కేంద్రం లైవ్‌స్టాక్ అసిస్టెంట్ మట్టయ్యను సస్పెండ్ చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని ఆదేశించారు. పశువైద్య ఉప కేంద్రంలో సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రుణమాఫీ అయిందా? లేదా? అని రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ఫీవర్ సర్వే వివరాలను అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలో పిల్లల నమోదు రిజిస్టర్, అందజేస్తున్న పోషకాహారం, వంటసామగ్రిని తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అక్కడక్కడ మురుగు కాల్వల్లో పిచ్చి మొక్కలు ఉండడాన్ని గమనించి వాటిని తొలగించాలని ఎంపీడీవో మంజూలను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి మురళితో ఫోన్‌లో మాట్లాడి గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు పట్టికను, వంటగది, మధ్యాహ్న భోజనం, వంట సామగ్రి, బియ్యాన్ని పరిశీలించారు. అమ్మఆదర్శ పాఠశాల కమిటీ కింద చేపట్టిన పనులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో మంజూల తదితరులు ఉన్నారు.

గుణాత్మక విద్యతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నల్లగొండ టౌన్: నియోజక వర్గాల వారీగా ఎంపిక చేసిన ప్రత్యేక పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించి ప్రస్తుత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో కనీసం 50 శాతం మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా చూడాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ఐఐటీపై దృష్టి సారించాలని, ప్రజల భాగస్వామ్యంతో మెరుగైన ఫలితాలు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని, అందుకు పాఠశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ఉపాధ్యాయులను ఇస్తామన్నారు. ప్రతీ పాఠశాలలో ఓ సబ్జెక్టు టీచర్ తో 8, 9, 10 తరగతులకు డిజిటల్ ప్రోగ్రాం రూపొందించాలని అన్నారు. పాఠశాలల్లో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, పెయింటింగ్ తక్షణమే పూర్తిచేయాలని, మాడ్యులర్ కిచెన్ గ్యాస్ సహా ఏర్పాటు చేయాలని, టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. అవసరమైన పాఠశాలలకు ఇంగ్లిష్ టీచర్లతో పాటు, వీలైతే కేరళ టీచర్లను సైతం ఇస్తామన్నారు. మంచి విద్యను అందించడం ద్వారా రానున్న 30 ఏళ్ల సమాజాన్ని విద్యావ్యవస్థనే తీర్చిదిద్దుతుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజకుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై కఠిన చర్యలు : ఎస్పీ

మహిళల భద్రత కోసం 8712670235 టోల్‌ఫ్రీ నంబర్



షీటీం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 21: మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడే ఆకతాయిలపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హెచ్చరించారు. మహిళలు, యువతుల భద్రత కోసం షీటీం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 8712670235 టోల్‌ఫ్రీ నంబర్ పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షీటీం బృందాలు మహిళల రక్షణలో ముందుంటూ ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే స్పందించి ఆకతాయిల ఆట కట్టిస్తున్నాయన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు పోలీస్‌శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లా వ్యాప్తంగా షీటీం బృందాలు జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వద్ద నిరంతరం నిఘా ఉంచుతున్నాయన్నారు. మైనర్లపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, లేదంటే షీటీం నంబర్ 8712670235కు, డయల్ 100కు, లేదా పోలీస్‌శాఖ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా జూలై నెలలో 14 ఫిర్యాదులు వచ్చాయని, 43 అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. జిల్లాలో మొత్తం 291 హాట్‌స్పాట్లను గుర్తించి నిఘా పెంచామన్నారు. కార్యక్రమంలో షీటీం సీఐ కరుణాకర్, ఉమెన్ పీఎస్ ఏఎస్ఐ ఉపేందర్, షీటీం ఏఎస్ఐ విజయలక్ష్మి, పీఆర్వో శంకర్, సిబ్బంది నర్సింహ, పాల్గొన్నారు.

● బంద్ ప్రశాంతం



ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మునుగోడులో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

●8లో..

మూసీ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్ల ఎత్తివేత

ఎగువ నుంచి భారీగా వరద రాక



కేతేపల్లి, ఆగస్టు 21: హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలతో మూసీ నదీకి వరద పోటెత్తుతోంది. దీంతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల సరిహద్దుల్లోని మూసీ ప్రాజెక్టుకు బుధవారం 3,755.52 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇప్పటికే గరిష్ఠ స్థాయి నీటినిల్వకు దగ్గరలో ఉండటం, ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో బుధవారం మధ్యాహ్నం క్రస్ట్‌గేట్లను ఎత్తాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని మూసీ నది పరివాహక ప్రాంతాల ప్రజలను మూసీ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తం చేశారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత 2, 7, 8 నెంబర్ల క్రస్ట్‌గేట్లను అడుగు మేర ఎత్తి 1,935.29క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆయకట్టులో వానాకాలం సాగు అవసరాలకు కుడి కాల్వకు 168.89 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 216.89 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 2,321.07 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెళ్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 645అడుగులు (4.46టీఎంసీలు) కాగా, బుధవారం సాయంత్రానికి 643.60అడుగులు (4.07టీఎంసీ) ఉంది.

చాకలిగట్టుకు దారేదీ?

● సాగర్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు

నాగార్జునసాగర్, ఆగస్టు 21: నాగార్జునసాగర్ ఒక గొప్ప పర్యాటక ప్రాంతమే కాకుండా అంతర్జాతీయ బౌద్ధక్షేత్రంగా కూడా విరాజిల్లుతుంది. దీంతో సాగర్‌కు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, బౌద్ధ మతస్థులు వస్తుంటారు. అంతేకాకుండా దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతో ఎకో టూరిజం పరంగా కూడా అభివృద్ధికి సాగర్‌లో అవకాశం ఉంది. పర్యాటకంగా అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్న నాగార్జునసాగర్ పర్యాటకంపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి.

చాకలి గట్టుకు దారేది?

జలాశయం మధ్యలో 400 ఎకరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జింకల సంరక్షణ కేంద్రమైన చాకలిగట్టు నాగార్జునకొండకు కేవలం కిలో మీటరు దూరంలో ఉంటుంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రోజు లాంచీలు నడుపుతారు. ఈ లాంచీలను చాకలి గట్టు మీదుగా నడిపితే ఎకో టూరిజం పరంగా సాగర్ మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలా చేస్తే సాగర్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది. ఏడాది క్రితం చాకలి గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు పరిశీలించారు. కానీ నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదు. పర్యాటకశాఖకు ఇంతటి ఆదాయ వనరులు ఉన్న చాకలి గట్టును నిర్లక్ష్యం చేయడం ఏమిటని పలువురు ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ వరకు లాంచీలు నడిపే అవకాశం

సాగర్ ప్రాజెక్టుకు దిగువన 21 కిలో మీటర్ల దూరంలో టెయిల్ పాండ్ ప్రాజెక్టును నిర్మించారు. 21 కిలో మీటర్ల దూరం వరకు సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా, క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు వదిలిన నీరు నిల్వ ఉంటుంది. ఈ నీటిలో లాంచీలను నడిపితే పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణించే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం ఈ ప్రతిపాదనలు కూడా పర్యాటకల శాఖ అధికారులు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపారు. కానీ నేటి వరకు ఎలాంటి అనుమతులు రాలేదు. సాగర్‌కు గురువారం రానున్న పర్యాటక శాఖ అధికారులు సాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు మెరుగు పరిచేలా అలాగే చాకలి గట్టుపైకి పర్యాటకులకు అనుమతి ఇచ్చేలా చూడాలని పర్యాటకులు కోరుతున్నారు.

నేడు చాకలి గట్టుకు పర్యాటక శాఖ అధికారులు

అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో ఉన్న చాకలి గట్టును గురువారం ఉదయం పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్, డైరెక్టర్ ఇలా త్రిపాఠీ, ఎండీ ఎస్.ప్రకాష్‌రెడ్డి పరిశీలించనున్నారు. వీరు చాకలి గట్టులో ఎకో టూరిజం అభివృద్ధి గురించి సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం హిల్‌కాలనీలో 274 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనం ప్రాజెక్టు సందర్శించి అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సౌకర్యాలను గురించి పరిశీలించనున్నారు.

నృసింహుడికి నిత్యపూజలు



ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవారలను మేల్కొపిన అర్చకులు గర్భగుడిలో కొలువదీరిన స్వయంభులను స్వర్ణ ప్రతిష్ఠమూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలు పూర్తి చేశారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో రామలింగేశ్వర స్వామికి శైవాగమ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,87,635 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

స్వామి వారిని దర్శించిన ప్రముఖులు

స్వామి వారిని షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబ్‌బాద్ ఎంపీ బలరాంనాయక్ స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

పిడుగుపాటుతో గేదె మృతి

మర్రిగూడ, ఆగస్టు 21: పడిగుపాటుతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని కుదాభక్షపల్లి గ్రామంలో మంగళ వారం రాత్రి జరిగింది. బాధితుడు సిరగోని శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గేదె పిడుగు పడటంతో గేదె మృతి చెందిందని అని తెలిపారు. గేదె విలువ రూ. లక్ష ఉంటుందని తెలిపారు. పాలిచ్చే గేదె మృతిచెందడంతో తాను ఆర్థికంగా నష్ట పోయానని తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొమ్మలు తొలగిస్తుండగా..

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 21: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం రాంపురం గ్రామంలో బుధవారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవూర మండలం ఊట్లపల్లికి చెందిన ఊరడి మల్లయ్య(35) కూలీ పని చేసూత జీవనం సాగిస్తున్నాడు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రాంపురం గ్రామంలో ముత్యాల మల్లయ్య అనే రైతు బత్తాయి తోటలో మొక్కలు తీయడానికి పదిమంది కూలీలతో పాటు మల్లయ్య కూడా వెళ్లాడు. మొక్కలు కోసే చేసే క్రమంలో బోర్ మోటర్‌కు ఆ బత్తాయి చెట్ల గుండా విద్యుత్ వైర్ వెళ్లింది. అది గమనించని మల్లయ్య తన వద్ద ఉన్న ఇనుప కట్టర్‌తో చెట్టను కొమ్మలు కట్ చేసే క్రమంలో విద్యుత్ వైర్‌ను కట్ చేశాడు. దీంతో కట్టర్ ద్వారా విద్యుదాఘాతంతో పడిపోయాడు. దీంతో తోటి కూలీలు వెంటనే 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతనిని పరిశీలించగా చని పోయినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ప్రస్తుతం భార్య గర్భవతి. భార్య ఊరడి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

ఇద్దరు డీలర్ల లైసెన్స్ రద్దు

గుర్రంపోడు, ఆగస్టు 21: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరు డీలర్ల లైసెన్స్‌లను జిల్లా వ్యవసాయ అధికారి శ్రవన్‌కుమార్ రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి తెలిపారు. బుధవారం కొప్పోలు గ్రామంలో కలెక్టర్ నారాయణరెడ్డి పర్యటనలో రైతులకు అధిక ధరకు యూరియా అమ్ముతున్నారని కలెక్టర్ దృష్టికి తేవడంతో స్పందించిన కలెక్టర్ విచారణ నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి నిర్వహించిన విచారణలో ట్రాన్స్‌పోర్టు చార్జీలు అధికమవుతుండడంతో సుమారు రూ.40 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు అమ్ముతున్న జ్యోతిఫర్టిలైజర్స్, శివశంకర్ ఫర్టిలైజర్స్‌ల లైసెన్స్‌లు జిల్లా వ్యవసాయ అధికారి రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

ఆస్పత్రి ఆవరణలో వ్యక్తి మృతి



ఖుర్షీద్ మృతదేహం

సూర్యాపేటక్రైం, ఆగస్టు 21: అనారోగ్యంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన సూర్యాపేటలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఖుర్షీద్(50) కొంత కాలంగా సూర్యాపేటలోని జేజేనగర్‌లో గల బంధువుల నివాసంలో ఉంటూ చర్చి కాంపౌండ్‌లో గల చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఏడాదిగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించింది. దీంతో చికెన్ సెంటర్‌కు వెళ్లడం మానేసి మద్యం సేవిస్తూ ఇంట్లో వెళ్లిన తర్వాత రెండు, మూడు రోజులకోమారు తిరిగి ఇంటికి వస్తున్నాడు. అందులో భాగంగానే ఈ నెల 19న ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి బుధవారం వరకు ఇంటికి వెళ్లలేదు. బంధువులు పట్టణంలో వెతికినప్పటికి ఆచూకీ లభించలేదు. మృతుడు మంగళవారం రాత్రి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని ఆస్ప త్రి ప్రాంగణంలో నిద్రించాడు. నిద్రలోనే అనారోగ్యంతో మృతిచెందాడు. ఉదయాన్నే గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి కుమారుడు బాసిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

హుజూర్‌నగర్, ఆగస్టు 21: వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు విటులు, గృహ నిర్వాహకురాలను పట్టుకున్నారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం... హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సాయంత్రం ఐదు గంటల సమయంలో సమాచారం రావడంతో తన సిబ్బందితో వ్యభిచార గృహంపై దాడి చేసి అక్కడ ఇద్దరు విటులు, నిర్వాహకురాలను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారివద్ద నుంచి రూ.1700, ఐదు సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఏషియన్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



శశాంక్ వనమాల

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 21: నల్లగొండ మిర్యాలగూడ పట్టణానికి క్రీడాకారుడు శశాంక్ వనమాల ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రాణిస్తున్నాడు. చైనాలో జరుగుతున్న టోర్నమెంట్‌లో అండర్-15 విభాగంలో తొలి రౌండ్‌లో హాంకాంగ్ క్రీడాకారుడు ఛాన్‌ఇక్‌హ్యాపై విజయం సాధించిన శశాంక్ మంగళవారం జరిగిన మలి రౌండ్‌లోనూ సత్తా చాటాడు. మలేషియా ఆటగాడు ఖైరుల్ అజ్లాన్‌ను ఓడించి ప్రీ క్వార్టర్స్‌కు చేరాడు. ప్రీక్వార్టర్స్‌లో చైనా క్రీడాకారునితో తలపడనున్నాడు.

ఇన్నోవేషన్ అవార్డు అందుకున్న సుమన్



అవార్డు అందుకుంటున్న సుమన్ భొక్రే

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 21: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సుమన్ బొక్రే ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాన్‌హలాల్ ఆహారం అందించేందుకు స్థాపించిన ఆర్బిట్ కిచెన్(ఓకే)కు ఇన్నోవేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో ఐక్యరాజ్య సమితి అవార్డు ప్రకటించిందన్నారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌జీడీ) పేరుతో ప్రకటించిన ఈ అవార్డును హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో అందుకున్నట్లు తెలిపారు. నాన్‌హలాల్ ఆహారం అవసరమైన వారి ఆకలిని తీర్చడంతో పాటు ఆర్బిట్ కిచెన్లలో ఈక్వెల్ ఆపర్చునిటీ కింద డిసబుల్డ్ పర్సన్ల సేవలను ప్రోత్సహించిస్తున్నందుకు రెండు విభాగాల్లో అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఓకేలోని భాగస్వామ్యులందరి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు.

రెండున్నర టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాలరూరల్, ఆగస్టు 21 : అక్రమంగా తరలిస్తున్న రెండున్నర టన్నుల రేషన్ బియ్యాన్ని బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి శివారులో స్పెషల్ బ్రాంచి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ ధర్మా తెలిపిన వివరాల ప్రకారం రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో స్పెషల్‌బ్రాంచి పోలీసులు చిన్నకాపర్తి శివారులో తనిఖీలు చేశారన్నారు. తనిఖీల్లో గ్రామశివారులో ఆటోను తనిఖీ చేయగా అందులో ఉన్నది రేషన్ బియ్యంగా గుర్తించారన్నారు. 50 బస్తాల్లో రెండున్నర టన్నుల బియ్యాన్ని తరలిస్తుండగా ఎస్‌ఐ తెలిపారు. ఆటోను, బియ్యాన్ని చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలు గ్రామాల్లో బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారని వీటిని యదాద్రి-భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం కల్వకుంటతండాకు చెందిన లావుడి ను రేష్ సేకరించి అక్కడికి తరలిస్తున్నాడని, పట్టుబడిన బియ్యంను ఆటోను చిట్యా ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

నార్కట్‌పల్లి, ఆగస్టు 21:జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే జిల్లాలో కొనసాగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రజల నగటు ఆరోగ్య స్థితిగతులు, జీవన ప్రమాణాలను సర్వే ద్వారా అంచనా వేసి భవిషత్ కార్యాచరణకు మార్గదర్శకంగా ఉండే ఆరోగ్య ప్రణాళిక తయారీ కోసం కేంద్రం ప్రభుత్వం ప్రతీ ఐదేళ్ల కోసారి జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే సిగ్మా రీసెర్చ్ అనే సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలోని ఇప్పటికే గుర్తించిన 42గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ప్రతీ బ్యాచ్‌కు ఏడుగురు చొప్పున, ఏడు బ్యాచ్‌లుగా సర్వే నిర్వహిస్తున్నారు.

ఎండుగడ్డి పిరం

- ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసం తెచ్చుకుంటున్న రైతులు
- గత ఏడాదితో పోల్చితే భారీగా పెరిగిన ధరలు
- ట్రాక్టర్ గడ్డి రూ.2500లకు కొనుగోలు చేస్తున్న రైతులు



ట్రాక్టర్‌లో వరి గడ్డి తీసుకొస్తున్న రైతు

చింతపల్లి, ఆగస్టు 21: పశుగ్రాసం కొరతతో మూగజీవాలు వేదన చెందుతున్నాయి. జీవాలను కాపాడుకునేందుకు రైతులు ఇతర జిల్లాల నుంచి రైతులు ఇతర జిల్లాల నుంచి పశుగ్రాసాన్ని అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి తెచ్చుకుంటున్నారు. పాలు ఇవ్వడానికి, వ్యవసాయం చేయడానికి పశువులకు మేలు పశుగ్రాసం అందించాలి. కానీ రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలు సాగు చేస్తుండడంతో పశుగ్రాసం దొరకడం లేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పశుగ్రాసం ధరలు భారీగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. చింతపల్లి మండలంలో ఈ సంవత్సరం పశుగ్రాసానికి తీవ్రమైన కొరత ఏర్పడింది. గడ్డి దొరక్కపోవడంతో మూగ జీవాలు అల్లాడిపోతున్నాయి. దీంతో బక్కచిక్కిపోతున్న ఆవులు, గేదెలను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. ఏటా పశువులు మేతకు సరిపడా ఉంచుకొని మిగిలిన దానిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేవారు. ప్రతి నెలా వరి గడ్డి, జొన్నగడ్డి సాగు చేసి గ్రాసానికి కొదవ లేకుండా తగిన ఏర్పాట్లు చేసుకునేవారు. గత ఏడాది సరిగా వర్షాలు సరిగా లేకపోవడంతో వరి సాగు తగ్గింది. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఆకలికి అలమటిస్తున్న జీవాలను చూడలేక కొందరు రైతులు కొండబాట పడుతుంటే, మరికొందరు అధిక ధర వెచ్చించి గడ్డి కొనుగోలు చేస్తున్నారు. మరికొద్దరు పాడి పోషణను వదిలేస్తున్నారు.

చింతపల్లి మండలంలో..

చింతపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కువ శాతం వ్యవసాయంపైనే ఆధారపడి నివసిస్తున్నారు. అనుబంధంగా పశుపోషణ చేస్తున్నారు. మండలంలో ఆవులు 9,558, గేదెలు 6,548, గొర్రెలు 38,227, మేకలు 9,885 ఉన్నాయి. గతేడాది వరకు ట్రాక్టర్ వరిగడ్డి రూ.600నుంచి 800లు పలకగా, ఈ సంవత్సరం రూ.2000 నుంచి 2500 వరకు చేరింది. మండలంలో పశుగ్రాసరం దొరకకపోవడంతో రైతులు ఇతర జిల్లాల బాట పడుతున్నారు. చింతపల్లి, వింజమూర్, ఘడియాగౌరారం, నసర్లపల్లి, గొడుకొండ్ల, పోలేపల్లి రాంనగర్, తక్కళ్లపల్లి, కుర్మేడ్, ఉమ్మాపురం, గొల్లపల్లి, చాకిలిశేరుపల్లి, అంగడి కుర్మపల్లి, గ్రామాలకు చెందిన రైతులు రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహింపట్నం, మహబూబ్‌నగర్ జిల్లాలోని అమన్‌గల్, కడ్తాల్, కందూకుర్, తాడిపత్రి నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

గడ్డి కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పాడి పోషణపైనే కుటుంబాన్ని నెట్టుకొట్టుస్తున్నాం. కొరత ఉన్నా లాభాలు వస్తాయ నే అనే ఆశతో పాడి పరిశ్రమను కొనసాగిస్తున్నా. ప్రభు త్వం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేసి ఆదుకోవాలి.

● బాదేపల్లి కృష్ణయ్య, రైతు గొడుకొండ్ల.

భారమైనా తప్పడం లేదు

నాకు మూడు గేదెలు ఉన్నాయి. గతంలో సొంత పొలంలో సాగు చేసుకోని వాటికి అవసరమైన గడ్డి సమకూర్చుకున్న. ఈ సారి బోరులో నీరు లేక సాగు చేయలేదు. గేదెలు పోషించేందుకు పశుగ్రాసం కొనుగోలు చేస్తున్నాం. భారమైనా తప్పడం లేదు.

● కడారి సత్తయ్య, రైతు గొడుకొండ్ల.

ఆంజనేయస్వామి శోభాయాత్రలో అపశ్రుతి

● విద్యుదాఘాతంతో పలువురికి గాయాలు ● నల్లగొండ జిల్లా చందంపేట మండలం పాగిళ్లలో ఘటన



పాగిళ్ల గ్రామంలో ప్రమాదానికి కారణమైన ప్రభ

చందంపేట, ఆగస్టు 21: ఊరంతా వేడుక చేస్తుండగా చివరి ఘట్టంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రభబండికి వైద్యుత్‌వైర్ తాకి విద్యుదాఘాతానికి గుర్రై ఎనిమిది మందికి గాయాలయ్యాయి. దీంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు. బుధవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. శ్రావణ మాసం పురస్కరించుకుని మధ్యాహ్నం ఒంటిగంటకు గ్రామస్థులు ఆంజనేయస్వామి శోభాయాత్రను నిర్వహించారు. సుమారు 250మంది గ్రామస్థులు పాల్గొన్న ఈ శోభాయాత్రలో ప్రభ బండ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో ప్రభ బండి వెళ్తుండగా గ్రామంలో విద్యుత్ వైర్ తాకడంతో విద్యుదాఘాతం జరిగింది. ఆ ప్రభబండిపై కూర్చొని ప్రభను పట్టుకున్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వారందరినీ ప్రైవేట్ వాహనంలో దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా ఇద్దరికి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్ర గాయాలైన జటావత్ కేలి, జటావత్ లక్ష్మిలను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యుదాఘాతం ఘటనతో ఆ కార్యక్రమాన్ని ముగించిన గ్రామస్థులు ఇళ్లకు చేరుకున్నారు.

కొలనుపాకలో శాతవాహనకాలం నాటి గ్రామం



కొలనుపాకలో లభించిన శతవాహన కాలంనాటి వస్తువులు

ఆలేరు రూరల్, ఆగస్టు 21: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకవాగు ఒడ్డున శాతవాహన కాలం నాటి ప్రాచీన చారిత్రాత్మక గ్రామాన్ని గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా ఆయన కొలనుపాకలో చారిత్మక ఆధారాల కోసం పరనిశోధిస్తున్నారు. ఈ సందర్భంగా ఈత్తిల వాగు ఒడ్డున పాటిగడ్డపై క్షేత్రసాయి పరిశోధన చేయగా ఈ విషయం బయట పడిందని తెలిపారు. ప్రాచీన కాలం నాటి గ్రామం వదిలి వెళ్లిన చారిత్రక ఆధారాలు లభించే చోటును తాటిగడ్డ అంటారని తెలిపారు. ఇక్కడ ఒకటో శతాబ్దం ముందు ఆ తర్వాత కాలంలో మానవ నాగరికత విల్లసిల్లింది అనడానికి అనేక చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయని తెలిపారు. ఇక్కడ భౌద్ధ మత నిర్మాణాలకు ఉపయోగించే పాలరాయి ముక్క, మట్టిపూస, రాగిపూస, వివిధ రంగుల్లో ఉన్న గాజు ముక్కలు గవ్వలు గుండ్రాటి రాయి డిజెన్ చేసిన కుండ పెంకులు, రాతి పనిముట్లు లభించాయని వివరించారు. ఈ చారిత్రక్మ ఆధారాన్ని బట్టి ఇక్కడ శాతావాహన కాలంలో- 1 నుంచి మూడు శతాద్బంలో ఒక గ్రామం ఏర్పడిందని, భౌద్ధం విలసిల్లిందన్నారు. ఆలేరు బిక్కేరు వాగు వద్ద ఉందని భౌద్ధ బిక్షకులు ఇక్కడ ఉండటం వల్ల ఈ వాగుకు బిక్కేరు వాగు పేరు వచ్చిందని తెలిపారు. బిక్కేరు వాగు సమీపంలోనే కొలనుపాక గ్రామం ఉందన్నారు. వాగు నుంచి జైన ఆలయం వరకు పురవస్తూ శాఖ పరిశోధిస్తే, భూగర్భంలో దాగి ఉన్న మరింత చరిత్ర బయట పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేములపల్లి, ఆగస్టు 21: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన జలగం రాములు(53) ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కొంతకాలంగా సూర్యాపేట పట్టణం అలకాపూరి కాలనీలో నివాసముంటున్నాడు. బుధవారం విధి నిర్వహణలో భాగంగా మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై బయలుదేరి వస్తుండగా శెట్టిపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే మిర్యాలగూడ నుంచి సూర్యాపేట వైపు వస్తున్న లారీ అతివేగంగా అజాగ్రత్తతో ఒక్కసారిగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాములు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టి కొద్ది దూరం దూసుకొని వెళ్లింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకోని మృతదేహానికి పంచనామా నిర్వహించి మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం రాములు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

రామన్నపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన తెడ్డు శేఖర్(46) రైతు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శేఖర్ ఈ నెల 19న తన వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకొని టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఇంటికి వస్తుండగా నిధానపల్లి క్రాస్ రోడ్డు వద్ద భువనగిరి నుంచి చిట్యాల వైపు వెళ్తున్న టీఎస్ 08 జెఔ 1998 బుల్లెట్ వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలైన శేఖర్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

నకిరేకల్: శ్రీకాకుళం జిల్లా నుంచి బులెట్ వాహనంపై ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌కు వెళ్తుండగా నకిరేకల్ శివారులో వాహనం అదుపుతప్పి బుధవారం ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలయ్యాయి. నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సావరకోట మండలంలోని కుమ్మరకుంట గ్రామానికి చెందిన సాదు సంతోష్(24), స్నేహితుడు సారత్ బులెట్‌బైక్‌పై వాళ్ల స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. నకిరేకల్ శివారులోని హరికృష్ణ పార్‌బాయిల్డ్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి డీ వైడర్‌ను ఢీ కొట్టారు. సంతోష్ అక్కడికక్కడే మృతిచెందగా సారత్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్సకోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు.

ఆత్మకూరు(ఎం): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. బోడుప్పల్‌కు చెందిన పగిడిపల్లి అబ్బయ్య, అతని భార్య సావిత్ర ద్విచక్రవాహనంపై ఆత్మకూరు (ఎం) మండలం రహీంఖాన్‌పేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా, మండల కేంద్రంలో ద్విచక్రవాహనానికి అకస్మాత్తుగా కుక్క అడ్డం వచ్చి తగలడంతో ఇరువురు పడిపోగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి భువనగిరి ఆసుపత్రికి తరలించారు.

అడ్వాన్స్ చెల్లించాలని వైద్యం చేయలేదు

- కొత్తపేట పారమిత ఆసుపత్రిలో బాలిక మృతి
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో ఘటన



అధిర(ఫైల్)

నల్లగొండ క్రైం, ఆగస్టు 21: శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న తమ కుమార్తెకు వైద్యం చేయకుండా అడ్వాన్స్ చెల్లించాలంటూ ఆలస్యం చేయడంతో చిన్నారి మృతిచెందిందని బాధితురాలి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం హైదరాబాద్ ఎల్బీనగర్‌లో కొత్తపేట పారమిత ఆసుపత్రిలో ఈ సంఘటన జరిగింది. బాధితులు, నల్లగొండ జిల్లా కేంద్రం పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పానగల్‌కు చెందిన చింత అజయ్‌బాబు కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, ఆయన కుమార్తె చింత అధిర(5) కొద్ది రోజులుగా న్యుమోనియాతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని చిన్నపిల్లలకు సంబంధించిన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆమెను మంగళవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని కొత్తపేటలో ఉన్న పారమిత ఆసుపత్రికి తీసుకెళ్లారు. అధిరకు వెంటనే వైద్యం చేయకుండా ఓపీ నమోదు చేయించి, అడ్వాన్స్ చెల్లించాలని 40 నిమిషాల వరకు వైద్యం ప్రారంభించలేదని బాలిక కుటుంబసభ్యులు ఆరోపించారు. అప్పటికే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న అధిరకు పారమిత ఆసుపత్రి నిర్వాహకులు సరైన సమయంలో చికిత్స అందించకపోవడంతోనే మూడు గంటల సమయంలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో ఆగ్రహం చెందిన కుటుంబసభ్యులు పారమిత ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. అధిర మృతికి ఆసుపత్రి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని, ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు నిర్వహించారు. విషయం తెలుసుకున్న వైద్యశాఖ అధికారులు ఆసుపత్రికి వచ్చారు. చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. పానగల్‌లోని స్మశాన వాటికలో బుధవారం అధిర అంత్యక్రియలు నిర్వహించారు.

అసోం వాసి అదృశ్యం.. కేసు నమోదు



లకన్ బూమ్‌జి(ఫైల్)

భువనగిరి రూరల్, ఆగస్టు 21: అసోం రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అసోం రాష్ట్రం సోనిటీపూర్ జిల్లా బిశ్వనాధ్ చార్లీ మండలం జాబ్ బౌరి గ్రామానికి చెందిన లకన్ బూమ్‌జి(22) ఆరు నెలల క్రితం భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం శివారులోని రాజశ్రీ ఎంటర్ ప్రైజెస్ ఎక్స్‌ప్లోజీవ్ గోదాం కంపెనీలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే ఓ గదిలో రూమ్‌లో నివాసముంటున్నాడు. అతనితో పాటు అతని బాబాయ్ బూమ్‌జీ కార్తీక్‌తో ఆరు నెలలుగా ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని బాబాయ్‌కి చెప్పి వెళ్లాడు. బుధవారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉంది. చుట్టు పక్కల వెతికినా కన్పించకపోవడంతో బుధవారం అతని బాబాయ్ కార్తీక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

గంజాయి తాగుతూ పోలీసులకు చిక్కి..

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 21: ఏడాది కాలంగా గంజాయి మత్తుకు వ్యసనపరులైన ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పోలీసులకు బుధవారం చిక్కారు. ఎస్‌ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్ గ్రామానికి చెందిన రమావత్ భానుప్రకాష్(19), ముద్దం బాలమల్లేశం(19), గోదాసు రాజు (19) గత ఏడాదిగా గంజాయికి బానిసలయ్యారు. వీరు హైదరాబాద్‌లోని దూల్‌పేట వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తెచ్చుకుని నిత్యం గ్రామంలోని పాతబడిన ఇంట్లో రాత్రి సమయంలో గంజాయి సేవిస్తున్నారు. అయితే సమాచారం అందుకున్న

భూదాన్‌పోచంపల్లి పోలీసులు బుధవారం ముక్తాపూర్ గ్రామంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పోలీసులు 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నిందితులు ముగ్గురు 8వ తరగతి వరకు క్లాస్‌మేట్లు. వీరు స్నేహితులుగా మారడంతోపాటు గంజాయికి బానిసలయ్యారు. వీరు రోజువారీ కూలీలుగా అక్కడక్కడా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య

భువనగిరి టౌన్, సూర్యాపేటక్రైం, డిండి, ఆగస్టు 21: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని పోలీస్‌క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ భార్య, భువనగిరి పట్టణానికి చెందిన వంట కార్మికుడు, సూర్యాపేటలో వృద్ధుడు, నల్లగొండ జిల్లా డిండి మండలంలో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు.

పోలీస్‌క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్ భార్య



విజయలక్ష్మి(ఫైల్)

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన చెందిన మెట్టు మధుసూదన్‌రెడ్డి భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. 18సంవత్సరాల క్రితం వివాహంకాగా, వారికి సంతానం కలగలేదు. దీంతో మొదటి భార్య అంగీకారం, బంధువుల నిర్ణయంతో రామన్నపేట మండలం నీర్నెంల గ్రామానికి చెందిన విజయలక్ష్మి(35)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఏడాది తేడాతో మొదటి భార్యకు కవలలుగా కుమారులు, రెండో భార్యకు కుమార్తె జన్మించారు. అప్పటినుంచి మొదటి భార్య పిల్లలతో 14 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటోంది. మధుసూదన్‌రెడ్డి రెండో భార్య, 15ఏళ్ల కుమార్తెతో కలిసి భువనగిరిరూరల్ పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తలెత్తిన ఆస్తి తదితర కుటుంబ వివాదాలతో కొంతకాలంగా దంపతులు, బంధువుల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. రోజువారిగానే విధులకు వెళ్లిన మధుసూదన్‌రెడ్డి బుధవారం మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వచ్చేసరికి విజయలక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో మధుసూదన్‌రెడ్డి కేకలు వేయడంతో క్వార్టర్స్‌లో ఉన్న పోలీస్ కుటుంబాలతో పాటు పక్కనే ఉన్న పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బంది క్వార్టర్స్‌కు చేరుకొని తలుపులను బద్దలుకొట్టి లోనికి ప్రవేశించి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతున్న విజయలక్ష్మిని కిందికి దించారు. అప్పటికే ఆమె మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో..



వేణుకుమార్‌రెడ్డి(ఫైల్)

భువనగిరి పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన వంట కార్మికుడు గంగదేవి వేణుకుమార్‌రెడ్డి(42) అద్దెకు ఉంటున్న ఇంట్లో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగదేవి వేణుకుమార్‌రెడ్డి, స్రవంతి సుమారు 12ఏళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. అతను హోటల్స్‌లో వంట కార్మికుడిగా పని చేస్తున్నాడు. కొంత కాలం క్రితం సొంతంగా టిఫిన్ సెంటర్ నిర్వహించాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్య, భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి తీవ్రస్థాయిలో గలాటా జరగడంతో భార్య స్థానికంగానే ఉండే పుట్టింటికి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి వేణుకుమార్‌రెడ్డి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణం అంటూ అత్త, భార్య, మరదలి పేరు తాను ఉరివేసుకున్న గది గోడపై రాసాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అంత్యక్రియలకు వెళ్లిన భార్య పిల్లలను అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

మృతదేహం పక్కన పరుగుల మందు బాటిల్



గుర్తుతెలియని వ్యక్తి

సూర్యాపేట పట్టణంలోని -65వ జాతీయ రహదారి వెంట అంజనాపురి కాలనీ సమీపంలో సద్దుల చెరువు కట్ట వద్ద సుమారు 60ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పక్కన పురుగు మందు డబ్బా లభించింది. పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీ భద్రపరిచినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ వివరాలు తెలిసిన వారు సెల్: 8712686005కు సమాచారం ఇవ్వాలని కోరారు.

యాసిడ్ ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

నల్లగొండ జిల్లా డిండి మండలం ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన తెలకపల్లి హరికృష్ణ(26) లారీ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం తల్లిని వేధిస్తుండేవాడు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రూంలో ఉన్న యాసిడ్ తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు.

ఎంపీ, ఎమ్మెల్సీలకు కార్యాలయాలు నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారావు

మిర్యాలగూడ, ఆగస్టు 21: ప్రభుత్వం పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలకు శాసనసభ నియోజకవర్గాల్లో ఒకే చోట కార్యాలయాలు ఏర్పాటు చేయాలని మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు కొందరు ఎక్కడ ప్రభుత్వ స్థలం, కట్టడాలు ఉన్నా ఆక్రమించి తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారని అన్నారు. పదవీకాలం పూర్తయినా వాటిని ఖాళీ చేయడం లేదని ఆరోపించారు. పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల తరహాలో కేంద్ర ప్రభుత్వం ఎంపీ కోటాలో నిధులు మంజూరు చేసి శాసనసభ నియోజకవర్గాల్లో ఎంపీ, ఎమ్మెల్సీలకు కార్యాలయాలు నిర్మించాలని అన్నారు. సమావేశంలో మట్టి మనుషులు లొడంగి సైదులు, మట్టపల్లి వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

వ్యాపారులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



వ్యాపారులకు సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ క్రైం, ఆగస్టు 21: నల్లగొండ పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రకాశంబజార్‌లో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని, తమకు కేటాయించిన గీత దాటి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠినచర్యలు తప్పవని నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రకాశం బజార్‌లోని కూరగాయల వ్యాపారస్థులు, రోడ్లపై బండ్లు పెట్టి వ్యాపారాలు చేసే ప్రాంతాలను బుధవారం ఎస్ఐ శంకర్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు కొంత ప్రాంతాన్ని కేటాయించి షాపుతో పాటు కేటాయించిన ప్రాంతం బయట వ్యాపారాలు నిర్వహించవద్దని సూచించారు. వ్యాపారులు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ వ్యాపారులు ఆలంపల్లి సుధాకర్, సోమయ్య, పోలీస్ సిబ్బంది సుదర్శన్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

23న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 21: జిల్లా కేంద్రంలోని రామగిరిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో ఈ నెల 23న సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు శ్రీలక్ష్మీ నారాయణ సేవా సంస్థ వ్యవస్థాపకులు, జ్యోతిష్య బ్రాహ్మజ్ఞాని దివ్యరమణచక్రవర్తులు తెలిపారు. సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శ్రావణమాసం శుభ శుక్రవారం సందర్భంగా నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాలకు మహిళా భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో లక్ష్మీనారాయణ సేవా సమితి సభ్యులు శారద, పావని, సరస్వతి, సరిత, మంజులత, దుర్గ, అనిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'డిండి'ని వెంటనే పనులు పూర్తి చేయాలి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నాయకులు

మర్రిగూడ, ఆగస్టు 21: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతాలైన దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ వెంటనే ఆమోదించాలని, సాగునీరు అందించే వరకు మా పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల సహాయ కార్యదర్శి నీలకంఠ రాములు, నాయకులు షైల సత్తయ్య, పిట్టల రమేష్, నీలకంఠం యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో నార్కోటిక్స్ అధికారుల దాడులు

దేవరకొండ, ఆగస్టు 21: దేవరకొండలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దేవరకొండలో ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీస్‌లో పేస్ట్ లాంటి మత్తుకు సంబంధించిన పదార్థం సరఫరా అవుతుందనే సమాచారం మేరకు అధికారులు దేవరకొండకు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పార్సిల్ అధికారుల బృందం పట్టణానికి చేరుకొని కార్గో పార్సిల్ సర్వీస్‌లో పార్సిల్ కోసం వచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని వచ్చిన పేస్ట్ లాంటి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై దేవరకొండ ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్‌ను సంప్రదించగా దేవరకొండలో నార్కోటిక్స్ కంట్రోల్ అధికారుల తగిన సమాచారం మేరకు పార్సిల్‌లో వచ్చిన తెల్లటి పేస్ట్ లాంటి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దానిని ల్యాబ్‌కి పంపిస్తే నిర్ధారణ అవుతుందని పేర్కొన్నారు. నార్కోటిక్స్ అధికారుల విచారణ చేస్తున్నట్లు సమాచారం.

శ్రీ వైష్ణవిదేవిగా దర్వేశిపురం ఎల్లమ్మ

కనగల్, ఆగస్టు 21: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీవైష్ణవిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయం నిత్యారాధన పూజలు నిర్వహించారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శాలిగౌరారం తహసీల్దార్‌గా యాదగిరి



యాదగిరి

శాలిగౌరారం, ఆగస్టు 21: శాలిగౌరారం తహసీల్దార్‌గా పి. యాదగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుమలగిరి సాగర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అన్వర్ హుస్సేన్ హైదరాబాద్‌కు గత నెలలో బదిలీపై వెళ్లారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేస్తున్న అబ్దుల్ సత్తార్ నుంచి తహసీల్దార్ యాదగిరి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.

ఎస్సీ వర్గీకరణ రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తాం



దామరచర్లలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండటౌన్, మునుగోడు, దామరచర్ల, నాగార్జునసాగర్, నార్కట్‌పల్లి, చండూరు, హాలియా, డిండి, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తామని మాలమహానాడు నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన భారత్ బంద్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, వ్యాపార సముదాయాలను బంద్ చేయించారు. పలుచోట్ల నిరసన ర్యాలీలు చేపట్టారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. లేనిచో జనాభా దామాషా పద్ధతిన వర్గీకరణ చేసి రిజర్వేషన్లను ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. మాలల డిమాండ్‌ను పట్టించుకోకుండా ప్రభుత్వం రిజర్వేషన్ల పరంగా ముందుకెళ్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కులాల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణకు పాల్పడ్డారని నాయకులు విమర్శించారు.

● వర్గీకరణ విషయంలో తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఉదయం నల్లగొండ బస్ డిపో ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి బస్సులను అడ్డుకున్నారు. వ్యాపార సముదాయాలను మూయించారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ మెంబర్ గోలి సైదులు మాట్లాడుతూ, వర్గీకరణ పేరుతో జాతుల మధ్య గొడవలు పెట్టి విడదీసేందు కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తెల్లమల్ల యాదగిరి, అద్దంకి రవీందర్, చింతపల్లి బాలకృష్ణ, సంద యాదగిరి, విగ్నేష్, గండమల్ల శ్రీను, అన్నిమల్ల చంద్రశేఖర్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పంబాల అనిల్ కుమార్, ఏకుల రాజారావు, కొండ లలిత, అద్దంకి రామకోటి, యాదగిరి, అన్ని మల్ల లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో మాలమహానాడు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మామలహానాడు సంఘం నేతలు పెరుమాళ్ల ప్రమోద్‌కుమార్, ముచ్చపోతుల నర్సింహ, శ్రీనివాస్, రెడ్డిమళ్ల యాదగిరి, యాదగిరి, బాలశివరాజు, శ్రీకాంత్, రవీందర్, రాజారామ్, దశరథ తదితరులు పాల్గొన్నారు.

● దామరచర్లలో మాలమహానాడు సంఘం నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి భైరం నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి విజయ్, నాయకులు భైరం దయానంద్, సుదర్శన్, భైరం బాలగురవయ్య, గోపి, శ్రీను, రవీందర్, ప్రేమ్‌కుమార్, వంశీ, కల్యాణ్, నవీన్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కోటేశ్వర్‌రావు, రవీంద్ర భూపతి, బాలాజీ రావు, బాల, ప్రకాష్, సుబ్బయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో బస్టాండ్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ మాట్లాడుతూ మాలల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాదాసు నరేష్, గోసుల సుదర్శన్, బాజ హేమంత్, భాను, సిరిగమల రాజు, గోసుల స్వామి, మాదాసు యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

● చండూరులో బంద్ విజయవంతమైంది. పట్టణంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మేడిపల్లి అక్షణ్, అద్దంకి కిరణ్, దాసరి వెంకటేశం, సరిపెల్లి రమేష్, తీగల వెంకన్న, గుండమల్ల నర్సింహులు, తీగల కేశవులు, కరుణాకర్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం పాల్గొన్నారు.

● హాలియాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లకుమల మధుబాబు, నామ లింగయ్య, మోటమర్రి వెంకటేశ్వర్లు, లకుమల లింగయ్య, మోటమర్రి సురేందర్, పాండు, జంగాల లక్ష్మమ్మ, గండమాల జానయ్య, రువ్వ వెంకటయ్య, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, డేవిడ్, ముత్యాలు, చలకుర్తి ముత్యాలు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

● డిండిలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం మండల నాయకులు అవుట మల్లేష్, నూనె ప్రసన్నకుమార్, గొరటి వెంకటేష్, నూనె మాధవ్, నూనె రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతే లక్ష్యం

● ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి



బాలుర టాయ్‌లెట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, దామరచర్ల, హాలియా, ఆగస్టు 21: ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ, హాలియాలో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పాఠశాలలను బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు సదుపాయాలను వినియోగించుకుని మంచి ఫలితాలను సాధించాలని కోరారు.

● 'నేను నా మిర్యాలగూడ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే నిధులు వెచ్చించి నిర్మించిన టాయ్‌లెట్స్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలల్లో తాగునీరు, టాయ్‌లెట్స్ కరెంట్, ల్యాబ్, క్రీడా వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్నెస్పీ క్యాంపు గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థినులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, హెచ్ఎం అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, పాఠశాల టీచర్లు కస్తూరి ప్రభాకర్, మాధవి, శ్రీనివాసరావు, చిన్నయ్య, నల్లమేకల వెంకయ్య, రాజు, మంగ్తా, అజ్మత్, పీడీలు సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ, శ్రీను, రహీం పాల్గొన్నారు.

● ఆయకట్టు పరిధిలోని ఎగువ రైతులు నీటిని వృథా చేయకుండా చివరి భూములకు నీరందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. మండలంలోని బండావత్‌తండా వద్ద వజీరాబాద్ మేజర్ పరిధిలోని కాల్వ వద్ద రైతులతో మాట్లాడారు. దామరచర్ల గ్రామంలోని చెరువును నింపి తాగు, సాగునీరు అందించేందుకు రైతులు సహకరించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్ఐ ఇరుగు రవి, ఇరిగేషన్ ఈఈ మాలునాయక్, రైతులు ఉన్నారు.

● హాలియా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 27లక్షల వ్యయంతో నిర్మించే అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను క్రమశిక్షణతో ఉన్నత స్థితికి చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. హెచ్ఎం గుండా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం పాఠశాలలో వంట గది షెడ్ ఏర్పాటు చేయాలని, ఆట స్థలాన్ని శుభ్రం చేయించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ గౌని సుధారాణిరాజారమేష్‌యాదవ్, కాకునూరి పెదనారాయణ, వెంకట్‌రెడ్డి, వెంపటి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధితో మెరుగైన రవాణా సౌకర్యం

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



హాలియాలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

గుర్రంపోడు, ఆగస్టు 21: రహదారుల అభివృద్ధితో మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సెంట్రల్ రిలీఫ్ ఫండ్ రూ.16కోట్లతో మండలంలోని నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారి క్రాస్‌రోడ్డు నుంచి వెల్మగూడెం గ్రామం వరకు డబుల్ రోడ్‌గా నిర్మించనున్న పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. డబుల్ రోడ్డు విస్తరణతో హాలియాకు రవాణా సౌకర్యం పెరుగుతుందని అన్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ముసలమ్మచెట్టు వరకు గల రహదారి గతంలో వెల్మగూడెం వరకు విస్తరణ జరిగిందని ఈ రోడ్డు కొనసాగింపులో భాగంగా 14 కిలోమీటర్ల పొడవున నల్లగొండ-దేవరకొండ రోడ్డు వరకు విస్తరణ జరుగుతుందన్నారు. మంత్రులు వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌ల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, మాజీ ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు సూదిని జగదీశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణ పంతులు, చల్లమల జగదీశ్వర్‌రెడ్డి, జాల చినసత్తయ్య యాదవ్, అమరేందర్‌గౌడ్, ఆర్అండ్‌బీ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



చండూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

చండూరు, నార్కట్‌పల్లి, ఆగస్టు 21: గంజాయి విక్రయించినా, తాగినా కఠినచర్యలు తప్పవని, మత్తు జీవితాలను చిత్తు చేస్తుందని చండూరు, నార్కట్‌పల్లి ఎస్ఐలు వెంకన్న, క్రాంతికుమార్ అన్నారు. మిషన్ పరివర్తన్‌లో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం చండూరు, నార్కట్‌పల్లిలో నిర్వహించిన అవగాహన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు కాని, జిల్లా డ్రగ్ కంట్రోల్ నంబర్ 871267026 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ భాష్యానాయక్, పోలీసు సిబ్బంది ఆనంద్‌రెడ్డి, నరేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. గ్రామాల్లో విద్యార్థులు సిగిరెట్లు తాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో ఏఎస్ఐ నర్సిరెడ్డి, హెచ్ఎం హిమజ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మల్లిఖార్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 21: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి జన్మదిన వేడుకలు నార్కట్‌పల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పుల్లెంల ముత్తయ్య, కర్నాటి ఉపేందర్, బొక్క భూపాల్‌రెడ్డి, కొత్త నర్సింహ, శేఖర్‌రెడ్డి, బానాల భాస్కర్‌రెడ్డి, ప్రజ్ఞాపురం రామకృష్ణ, కొల్లు రాంరెడ్డి, బోడ శ్రీను, రవిచంద్ర, వడ్డేపల్లి నాగరాజు, జానీ, బొబ్బలి దేవేందర్, గబ్బర్‌సింగ్, లక్ష్మణ్, సతీష్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకోవాలి

డిండి, ఆగస్టు 21: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని డి.నెమలిపూర్ గ్రామ ఎల్లమ్మతల్లి దేవాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎల్లమ్మ తల్లి దీవెనలు ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అరుణసురేష్‌గౌడ్, కిన్నెర హరికృష్ణ, శ్రీనునాయక్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

చందంపేట: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో బుధవారం కంఠమహేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్, చింతపల్లి సుభాష్, లోక్యానాయక్, రాములు, రంగయ్య పాల్గొన్నారు.

జ్వర సర్వేను పూర్తి చేయాలి : డీఎంహెచ్‌వో



పీహెచ్‌సీలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న శ్రీనివాస్

గుర్రంపోడు, ఆగస్టు 21: జ్వర సర్వేను నేటితో పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గుర్రంపోడులో జ్వర సర్వేను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, డాక్టర్ భవాని చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మిర్యాలగూడ టౌన్: సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ యూసుఫ్ అన్నారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ పట్టణంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యారోగ్య శాఖ సహకారంతో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

నల్లగొండ టౌన్, ఆగస్టు 21: రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెన్షనర్లకు నాలుగు డీఏలు బకాయిపడి ఉందని, డీఏల కోసం పోరాటాలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని (కాంట్రిబ్యూటరీ పెన్షన్) రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఈహెచ్ఎస్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నాణ్యమైన క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ అందించాలని అన్నారు. ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షు డు నూకల జగదీష్‌చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, రాష్ట్ర ఆడిట్ కమి టీ సభ్యుడు పాదూరి విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు కుకుడాల గోవర్ధన్, కృష్ణారెడ్డి, వై.సత్తయ్య, అబ్దుల్ ఖాదర్, వాణిశ్రీ, రమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

కనగల్: వివిధ సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరగని రైతులు ఆందోళన చెందవద్దని ఏవో అమరేందర్‌గౌడ్ తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు తమ ఏఈవోలను కలవాలని సూచించారు.

చిట్యాల: చిట్యాల జడ్పీ హస్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థులకు బుధవారం యూత్ ఫర్ సేవ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిలకరాజు శ్రీనివాస్ సహకారంతో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాధవి, ఇందిర పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: బీజేపీ యువమోర్చా సోషల్ మీడియా రాష్ట్ర కోకన్వీనర్‌గా కొండమల్లేపల్లి మండలానికి చెందిన నెల్లికంటి గోపి ప్రజాప్రతి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి కృషి చేసిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవాళ్ల మహేందర్, జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖికి కృతజ్ఞతలు తెలిపారు.

చింతపల్లి: చింతపల్లి మండలంలోని పోలేపల్లిరాంనగర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మునుకుంట్ల శేఖర్ తండ్రి యాదయ్యగౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలునాయక్ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ భవానీపవన్‌కుమార్, రాంసింగ్ ఉన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని నెమ్మాని జడ్పీహెచ్ఎస్ 1998-99 బ్యాచ్‌కు చెందిన పబ్బు లింగస్వామి ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో ఇదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ వంతుగా సేకరించిన రూ.61 వేలు లింగస్వామి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కే.రవిశంకర్, చింత సుధాకర్, పీ.రామచంద్రం, నగేష్, లింగాచారి, జాల ప్రవీణ్, రవి, మదనాచారి, పురుషోత్తం, పద్మ, సోని, కవిత పాల్గొన్నారు.

నల్లగొండ కల్చరల్: పేద ప్రజలకు సేవ చేయడమే తమ సంస్థ లక్ష్యమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. శ్రీ భక్తాంజనేయస్వామి సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సుందరయ్య కాలనీలో వృద్ధ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సమితి జిల్లా అధ్యక్షుడు సిరప్రగడ శ్రీనివాస్‌శర్మ, రుద్రాక్షి నర్సింహ, డాక్టర్ భరత్, పులిజాల నాగశ్రీ, పులిజాల కీర్తన తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలో జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్ల తో నిర్మించాలని పలువురు వ్యాపారస్థులు కోరారు. మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మట్టి కట్టతో బ్రిడ్జి నిర్మిస్తే చిట్యాల రెండు భాగాలుగా విడిపోతుందన్నారు. అంతేకాక వ్యాపారాలు దెబ్బతింటాయని, నిర్మాణాలకు భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాల్వేరు బాలరాజు, యాదగిరి, శ్యాం, సత్యనారాయణ, జగిని వెంకన్న, వెంకట్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హరీశ్‌రెడ్డి, మండల నాయకులు మామిడి రమేష్ డిమాండ్ చేశారు. ప్రతీ ఒక్కరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ ఈనెల 22వ తేదీన మండలకేంద్రంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుమలగిరిలో నిర్వహించే కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని వారు తెలిపారు.

చండూరు: బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చండూరు పట్టణానికి చెందిన పేర్ల గణేష్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ నియామక పత్రాన్ని అందజేశారు.

డిండి: మండలంలోని బ్రాహ్మణపల్లి రహదారి బీటీరోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎల్లేష్ మాదిగ డిమాండ్ చేశారు. రోడ్డు మంజూరై ఏడాదవుతున్నా నిర్మాణ పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు.

దేవరకొండ: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ పని చేసిన బాధ్యతతో, అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు ఉంటుందని దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య అన్నారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బదిలీపై వెళుతున్న సీనియర్ అసిస్టెంట్ శాంతికుమారి, రికార్డు అసిస్టెంట్ యాదమ్మలను ప్రిన్సిపాల్‌తో పాటు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

మిర్యాలగూడ టౌన్: గృహజ్యోతి పథకానికి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ కోరారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో గృహజ్యోతి పథకానికి టిక్ చేయని లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఎడిట్ అప్లికేషన్ ప్రవేశపెట్టిందన్నారు. సంబంధిత పత్రాలతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కనగల్: మొక్కలను నాటి బాధ్యతగా పెంచాలని ఏపీవో సుధాకర్ కోరారు. జీపీ సిబ్బందికి మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ టీఏలు యాదగిరి, హరి. రమేష్, ఎఫ్ఏ శ్యామల పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండలో జర్నలిస్టు సయ్యద్ అజ్మతుల్లా గుండెపోటుతో మృతి చెందాడు. అజ్మతుల్లా మృతదేహానికి ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

నల్లగొండ: కోలకత్తా నగరంలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు నాగమణి, ఎన్.సరళ డిమాండ్ చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం క్లాక్ టవర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళలు యూటీఎఫ్ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులను వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ఎస్.సరళ, రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, అరుణ, రమాదేవి, సరళ, బి.అరుణ, సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, కోశాధికారి శేఖర్‌రెడ్డి, టాప్రా జిల్లా అధ్యక్షుడు శ్యాం, గోవర్ధన్ పాల్గొన్నారు.